హామీల అమలు ఘనత సీఎం జగన్‌కే



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన గృహ సారథులు, కన్వీనర్‌లు

- వైఎస్సార్‌సీపీ వైపే రాష్ట్ర ప్రజలు
- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : మూడున్నరేళ్ల కాలంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, దీంతో రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మనుబోలు సీపీఆర్ కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు శిక్షణా కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొని, పలు సూచనలు సలహాలు ఇచ్చారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇవ్వాల్సిన కరపత్రాలు, వారిని అడగాల్సిన ప్రశ్నలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఒక్కో గృహ సారథికి గరిష్టంగా 50 గృహాలు మాత్రమే ఉన్నందున పార్టీలు, వర్గాలకతీతంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఇస్తున్న సంక్షమ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా కలుపుకుని పోవాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడిగా పేరు తెచ్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే ప్రతి హామీని తుంగలో తొక్కిన ఘనత ప్రతపక్ష నేత చంద్రబాబుకి దక్కుతుందన్నారు. ఈ విషయాలను లబ్ధిదారులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. సంక్షేమ పథకాలను వివరించే క్రమంలో కరుడు గట్టిన టీడీపీ అభిమానుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయినా పట్టించుకోవద్దని, తటస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల పార్టీ అని చెప్పుకునే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వారికి అందిన లబ్ధి ఏమీ లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని, కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరు కావడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైస్ ఎంపీపీలు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, గుండాల చందన, సర్పంచ్ కంచి పద్మమ్మ వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్ రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, గుండాల ఆదినారాయణ, సాయి మోహన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శశిరెడ్డి, రమేష్, మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

కోవూరు : ముందు వెళ్తున్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన పడుగుపాడు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు నుంచి సిలికా లోడ్‌తో ఉన్న లారీ కర్ణాటకలోని హోస్‌పేటకు వెళ్తుండగా పడుగుపాడు సమీపంలో ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిలికా లారీ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ గుణశేఖర్‌కు కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 సాయంతో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి ఆరాతీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల సీజ్



సీజ్ చేసిన టిప్పర్లు

కోవూరు : అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను కోవూరు సెబ్ సీఐ నరహరి, ఎస్సై శ్రీనివాస్ తమ బృందంతో దాడులు చేసి బుధవారం సీజ్ చేశారు. వారి కథనం మేరకు.. వెంకటేశ్వరపురం వద్ద పెన్నానది నుంచి జాతీయ రహదారిపై ఇసుక లోడ్‌తో టిప్పర్లు వెళ్తున్నాయనే సమాచారం అందడంతో వారు తనిఖీలు చేసి వాహనాలను పట్టుకున్నారు. ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేశారు. సీజ్ చేసిన వాహనాలతో సహా డ్రైవర్లను కోవూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేత్రదానం



కౌసల్యమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగుకు చెందిన కౌసల్యమ్మ (88) తన స్వగృహంలో మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను పెద్దాస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీ సింగ్ కోరారు.

దోపిడీ కేసులో పురోగతి

నెల్లూరు(క్రైమ్): న్యూ మిలటరీ కాలనీలో జరిగిన దోపిడీ కేసులో వేదాయపాళెం పోలీసులు కొంత పురోగతి సాధించారని సమాచారం. ఘటన జరిగిన ఇంటి సమీపంలోని సీసీ పుటేజీలను సేకరించిన పోలీసులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితులు చేతికి గ్లౌజ్‌లు, మొహానికి గుడ్డలు కట్టుకొని కారులో వచ్చి దోపిడీ చేసి వెళ్లారనే అంశాన్ని గుర్తించారని తెలిసింది. కారు జీఎన్టీ రోడ్డు వైపు వెళ్లినట్లు సీసీ పుటేజీలో ఉంది. నిప్పో, వేదాయపాళెం వైపు ఉన్న సీసీ టీవీలు పనిచేయకపోవడంతో అక్కడి నుంచి కారు ఏ వైపు వెళ్లిందో తెలియరాలేదు. దీంతో ఆ రహదారి వెంబడి ఉన్న సీసీ పుటేజీల పరిశీలనలో పోలీసులు నిమగ్నమయ్యారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): గోడపైన రేకుల విషయమై వ్యక్తిపై కొందరు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వారధి సెంటర్‌లో హుస్సేన్, ఖాజారహంతుల్లా పక్కిళ్లలో నివాసం ఉంటున్నారు. ఒకే గోడకు రెండు వైపులా రేకుల వరండాను వేసుకున్నారు. ఈ క్రమంలో గోడపై ఉన్న రేకులను తొలగించాలని ఖాజారహంతుల్లాను హుస్సేన్ మంగళవారం కోరారు. దీంతో వీరి మధ్య వివాదం చోటుచేసుకుంది. హుస్సేన్‌పై ఖాజారహంతుల్లా, అతని కుటుంబసభ్యులు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మినీబైపాస్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన రమేష్, రామలింగాపురానికి చెందిన నవీన్ నడుమ ఆర్థిక విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 12న రమేష్ తన స్నేహితులు శ్రీనివాసులు, జయరామయ్యనాయుడితో తడికలబజార్ సెంటర్‌లోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం వద్ద మాట్లాడసాగారు. దీంతో అక్కడికి వచ్చిన నవీన్‌తో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన నవీన్ ఆయనపై రాయితో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిబంధనలు తప్పక పాటించాలి



కోవూరు : మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మజ

- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

కోవూరు : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పక పాటించాలని తహసీల్దార్ పద్మజ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నేతలతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడా ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేయరాదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో సభలు ఏర్పాటు చేయరాదన్నారు. ఎక్కడైనా సమావేశాలు నిర్వహించుకోవాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, మండల సచివాలయాల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

బుచ్చిరెడ్డిపాళెం : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ పద్మజ కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో వారు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉందని, దీనిని అన్ని రాజకీయ పార్టీల వారు తప్పకుండా పాటించాలని కోరారు. అలాగే మార్చి 13వ తేదీన జరిగే ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, సీపీఎం నేత మల్లికార్జున, బీజేపీ నేత శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వాలి



వెంకటాచలం : ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ నాగరాజు

వెంకటాచలం : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఉగాదిలోగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ నాగరాజు ఆదేశించారు. వెంకటాచలం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఈఈ నాగరాజు బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నాణ్యమైన మెటీరియల్‌ను పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. అలాగే బిల్లులు కూడా త్వరితగతిన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని వెల్లడించారు. లబ్ధిదారుల చేత ఉగాదిలోగా నిర్మాణాలు పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో అధికార సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. ఆయన వెంట ఏఈ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నేత మందల పెంచలయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

కొడవలూరు : నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేసి ఉగాది కల్లా గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరులో శివాలయం వెనుకనున్న జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 39 గృహాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వం బిల్లులను సకాలంలో చెల్లిస్తోందని, నిర్మాణంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. సిమెంటు, స్టీలు తదితర సామగ్రి కూడా అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, జాలయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఉన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

- సెబ్ సీఐ వెంకటరావు



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

పొదలకూరు : విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని, ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని సెబ్ సీఐ బి.వెంకటరావు సూచించారు. స్థానిక ఐటీఐ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు తెలిసీ తెలియని వయస్సులో మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతారని పేర్కొన్నారు. వాటిని వినియోగిస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందని వెల్లడించారు. మత్తుపదార్థాలపై సమాచారం తెలిస్తే వెంటనే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మురళీధర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ



వసతులను పరిశీలిస్తున్న అధికారులు

కోవూరు : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పద్మజ, సీఐ కె.రామకృష్ణారెడ్డి, ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలానికి సంబంధించి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థిని



శ్రావణి

వెంకటాచలం : రాష్ట్ర స్థాయి అండర్–14 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.శ్రావణి ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.లక్ష్మీకామేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని బీహెచ్‌పీవీ గ్రౌండ్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రావణి పాల్గొంటుందని తెలియజేశారు.

వేడుకగా ధ్వజారోహణ



చప్పర ఉత్సవానికి ముస్తాబైన స్వామి అమ్మవార్లు

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం బుధవారం వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శేష వాహనంపై కొలువుదీరిన స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు బండారు సుబ్రహ్మణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్ పూజలు చేశారు. కార్య నిర్వహణాధికారి బి.శాంతయ్య, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ భిక్షాలు

బుచ్చిరెడ్డిపాళెం : పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా డిప్యూటీ డీఈఓ కె.భిక్షాలు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పురోగామి తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల కోసం పురోగామి తరగతులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీటి వల్ల ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు పాఠ్యాంశాలను అభ్యసించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బైజూస్ తరగతులను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగమంచు.. కనువిందు



పొదలకూరులో ఏర్పడిన పొగమంచు

పొదలకూరు : చలితీవ్రత తగ్గుతున్నా పొగమంచు వీడడం లేదు. తరచుగా మంచు కురుస్తూ దారులు మూసుకుపోతున్నాయి. హిమ సోయగం ఆహ్లాదకరంగా ఉన్నా వాహనచోదకులకు ఇబ్బందిగా మారుతోంది. బుధవారం ఉదయం 8 గంటలకు వరకు పొగమంచు కనువిందు చేసింది.

పంట నమోదును పూర్తి చేయాలి



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ముత్తుకూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఇందుకూరుపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రాజకుమార్ తెలిపారు. మండలంలోని మామిడిపూడి, నేలటూరు, మొగళ్లూరు, బ్రహ్మదేవి తదితర గ్రామాల్లో వరి పైరును బుధవారం మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది నమోదు చేసిన పంట నమోదు సర్వే నంబర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంట నమోదు పూర్తయిన తర్వాత రైతుల చేత ఈ–కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపకరిస్తుందన్నారు. అవసరమైతే రైతుల ఇళ్లకు వెళ్లి వారి వేలిముద్రలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పరీక్షలపై భయం వీడాలి



పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఏపీసీ ఉషారాణి

- ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి

కొడవలూరు : పరీక్షల పట్ల ఉన్న భయం, అపోహలు వీడాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్(ఏపీసీ) ఉషారాణి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'పరీక్షా పర్వ్ 4.0' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యా సంస్థల్లో పరీక్షలను వేడుకలుగా నిర్వహించేలా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా విభాగాలు పరీక్షా పర్వ్ 4.0 కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదివేలా చేయడం, పరీక్షలకు కాకుండా వేడుకలకు హాజరవుతున్నామన్న భావన కలిగించేలా చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పది పరీక్షలకు 46 రోజుల సమయం ఉన్నందున సబ్జెక్టుల వారీగా ప్రణాళిక రూపొందించుకుని సందేహాలు నివృత్తి చేసుకొంటూ చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, డైట్ అధ్యాపకుడు విజయచంద్ర, పాఠశాల హెచ్‌ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు రఫీ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు అంకురార్పణ



బుచ్చిరెడ్డిపాళెం: అంకురార్పణ చేస్తున్న అర్చకులు



బుచ్చిరెడ్డిపాళెం: శేషవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టమట్టిని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇస్కపాళెంలో..

మండలంలోని ఇస్కపాళెంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, ఈశ్వరీదేవి మఠంలో ఉత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కోడూరు శ్రీనివాసులురెడ్డి–రాజేశ్వరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకులు ఆదిశేషయ్య పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వెనుక గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు.